క్లుప్తంగా

'దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జైనూర్: ఆదివాసీ నాయకుడు మర్సుకోల లక్ష్మణ్, వడ్డెర కుటుంబాలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉమ్మడి జిల్లా న్యాయవాద జేఏసీ నాయకులు బానోత్ జగన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సంజీవ్‌నగర్ కాలనీ (వడ్డెరగూడ)లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాథోడ్ సందీప్‌కుమార్, జాదవ్ గణపత్‌నాయక్, నాయకులు శంభు తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

రెబ్బెన: మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో మంజుల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్ బుక్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. 30 కిలోల బరువు కలిగిన ఒక్కో బ్యాగు ధర రూ.1116 ఉందన్నారు.

బోర్ మోటార్ ఏర్పాటు



మోటార్ ఏర్పాటు చేసిన సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై మోటార్ బాగు చేయరూ శీర్షికన గురువారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు శనివారం చెడిపోయిన మోటార్, స్టార్టర్ స్థానంలో కొత్తవి బిగించి నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో ఎంపీవో గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, సిబ్బంది ఉన్నారు.

యూనిఫామ్ క్లాత్ పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

కెరమెరి: 2024 –25 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫామ్ క్లాత్‌ను శనివారం ఎమ్మార్సీ సిబ్బంది ఎంఐఎస్ కోఆర్డినేటర్ అశ్విని, సీసీవో మహేందర్ వీవో సభ్యులకు, ఐకేపీ సీసీలకు పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 83 ప్రభుత్వ పాఠశాలలకు గాను 50 పాఠశాలలకు చెందిన 2748 మంది విద్యార్థులకు 2786 మీటర్ల క్లాత్ పంపిణీ చేశారు. ఐకేపీ సీసీలు శంకర్, ధన్‌రాజ్, శ్యాంరావు, సుబ్బారావు, సత్తయ్య, వీవో సభ్యులు ఉన్నారు.

పశువులకు చర్మవ్యాధి!



దహెగాంలో చర్మవ్యాధి సోకిన ఆవు

దహెగాం: పశువులకు చర్మవ్యాధి సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు పశువులకు సోకేది లంపిస్కిన్ వ్యాధి అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌ను సంప్రదించగా పశువులకు సోకింది లంపిస్కిన్ వ్యాధి కాదని చర్మవ్యాధి అని, దీనికి పశువైద్యశాలలో వైద్యం అందుబాటులో ఉందన్నారు.

'ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తాం'

భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాజారాంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించగా పలువురి ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఇచ్చోడ: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుడు రవికాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్, దుబార్‌పేట్ కాలనీల్లో శనివారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

హైలెవల్ వంతెనలు నిర్మించరూ..!

- ఏటా వర్షాకాలంలో మునుగుతున్న లోలెవల్ వంతెనలు
- గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు
- ఎండాకాలంలో వంతెనల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్



దుబ్బగూడ ఒర్రెపై నుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)



ఇది మండలంలోని ఖిరిడి గ్రామ పాఠశాల సమీపంలో గల ఒర్రె. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఉప్పొంగడంతో గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నపాటి వర్షాలకే వరద ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. ఒర్రె వల్ల పడుతున్న అవస్థలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

వాంకిడి: ఏటా వర్షాకాలంలో మండలంలోని పలు గ్రామాలకు లోలెవల్ వంతెనలతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిచిపోవడం, ఎవరైనా గల్లంతు అవ్వడం, రోడ్లు తెగిపోవడం, వంతెనలు కోతకు గురికావడం వంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజాప్రతినిధులు పర్యటించి పలు హామీలు ఇచ్చి సరిపెట్టుకున్నారు. ఉన్నతాధికారులు సైతం స్థానిక అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశిస్తున్నారే తప్పా వంతెనల నిర్మాణాలలో మాత్రం పురోగతి కనిపించడం లేదు.

దీంతో మండల వాసులకు ప్రతీ ఏడాది వరద కష్టాలు తప్పడం లేదు. ఎండాకాలంలోనే వంతెనల నిర్మాణాలు చేపడితే వచ్చే వర్షాకాలంలో కష్టాలు తప్పుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

రాకపోకలు బంద్..

వర్షాకాలంలో ఖమాన, కనర్‌గాం, దుబ్బగూడ, ఖిరిడి, ఇందాని, లంజన్‌వీర, సవాతి, చౌపన్‌గూడ, పాటగూడ, నవేగూడ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై అనేక లోలెవల్ వంతెనలు ఉన్నాయి. పిప్పర్ గోంది, ఎనోలి, గోండు కొసార, కనర్‌గాం జీపీలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుపై ఉన్న ఒర్రెలకు అసలు వంతెనలే లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సారైనా వరదలను దృష్టిలో పెట్టుకొని వంతెనల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారుల గుండా హైలెవల్ వంతెనలు మంజూరైనప్పటికీ ఏడాది గడిచినీ నిర్మాణానికి పునాదులు పడలేదు. మండలంలోని ఖమాన, రొహినిగూడ, ఎనోలి, సల్పలగూడ, తదితర గ్రామాలకు వెళ్లే రహదారులపై వంతెనలు మంజూరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎటూ వెళ్లలేని పరిస్థితి



మా గ్రామానికి ప్రారంభంలో ఉన్న ఒర్రెపై లోలెవల్ వంతెన ఉంది. గ్రామం మధ్యలో ఉన్న ఒర్రెపై అసలు వంతెనే లేదు. దీంతో భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి గ్రామం జలమయమవుతుంది. అత్యవసర సమయాల్లో ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వర్షాకాలం ప్రారంభమయ్యే లోగా వంతెనల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– దుర్గం దినకర్, ఖిరిడి

చర్యలు చేపట్టాలి



మా గ్రామ సమీపంలో కనర్‌గాం రహదారిపై లోలెవల్ వంతెన కారణంగా ఏటా ఇబ్బందులు పడుతున్నాం. కాగజ్‌నగర్ వెళ్లే దారిపై నందూప బ్రిడ్జి అసంపూర్తిగా ఉంది. గుండి బ్రిడ్జి సైతం అసంపూర్తిగానే ఉంది. వాంకిడి వెళ్లే దారిపై లోలెవల్ వంతెన ఉండటంతో భారీ వర్షాలు కురిస్తే ఇంటి నుంచి కదల్లేని పరిస్థితి నెలకొంటుంది. అధికారులు ఇప్పటికైనా హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టాలి.

– నగోషే శ్రీనివాస్, దుబ్బగూడ

మట్టిరోడ్డుతో ఇబ్బందులు

- కొత్తపల్లి గ్రామస్తుల 'దారి' కష్టాలు
- బీటీ రోడ్డు నిర్మించాలని స్థానికుల వేడుకోలు



బీటీకి నోచుకోని పిక్లాతండా –కొత్తపల్లి రోడ్డు

లింగాపూర్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అనేక గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మట్టిరోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పిక్లాతండా నుంచి నిమ్మతండా, హిరాపూర్, కొత్తపల్లి వరకు, గుమ్నూర్ నుంచి వంకామద్ది వరకు వెళ్లే మట్టిరోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మట్టిరోడ్డు బీటీ రోడ్డుగా ఎప్పుడు మారుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గుంతలమయంగా మారినదారుల్లో ప్రయాణించలేక మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు కంచన్‌పల్లి రోడ్డు మీదుగా 12 కిలోమీటర్లు చుట్టూ తిరుగుతున్నారు.

బీటీకి నోచుకోక..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా తమ జీవితాల్లో మార్పు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మండల ప్రజాప్రతినిధులు రోడ్డు మంజూరు చేయాలని సమస్యను జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇప్పటివరకు బీటీ రోడ్డు మంజూరు కాలేదు. వానాకాలంలో మట్టిరోడ్డు గుండా ప్రయాణించేందుకు వృద్ధులు, పిల్లలు బురదతో అనేక అవస్థలు పడుతున్నారు. వాహనదారులు సైతం మట్టిరోడ్డుపై వాహనాలు నడపలేక పోతున్నారు.

మట్టి రోడ్లే దిక్కు..

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధి నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ చాలా వరకు మట్టిరోడ్లే ఉన్నాయి. వానాకాలంలో మట్టిరోడ్డు గుండా ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో వెళ్లే మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తిప్పలు తప్పడం లేదు



మట్టిరోడ్డు గుండా వెళ్లాలంటే చాలా తిప్పలు పడుతున్నాం. వానాకాలంలో ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే ఎక్కడ జారి పడతామోనని భయాందోళన చెందుతున్నాం. బీటీరోడ్డు లేక మా గ్రామానికి ఆటోలు కూడా రావడం లేదు.

– ఆదే సురేశ్, కొత్తపల్లి

బీటీగా మార్చాలి



రవాణా సౌకర్యం మెరుగుపడ్డప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. కానీ మా గ్రామానికి రవాణా సౌకర్యం సరిగా లేక విద్య, వైద్యం వంటి సదుపాయాలు సమకూరడం లేదు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో వెంటనే బీటీరోడ్డు మంజూరు చేయాలి.

– రాథోడ్ గోవింద్, పిక్లాతండా

బావి పనులు పరిశీలన



బావి పనులు పరిశీలిస్తున్న అధికారులు

కెరమెరి: మండలంలోని శివగూడ గ్రామంలో కొనసాగుతున్న బావి పనులను శనివారం ఎంపీడీవో కృష్ణారావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య పరిశీలించారు. శివగూడలో భగీరథ నీరు వస్తున్నా ప్రజలు బావి నీటినే తాగడానికి వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ప్రజలు బావికి చుట్టూ గోడ కట్టాలని, మురికి నీరు బావిలో చేరకుండా చూడాలని ఎంపీడీవోను కోరారు. దీంతో ఎంపీడీవో వెంటనే పనులు ప్రారంభించాలని, పెద్ద బండరాళ్లను తొలగించే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలకు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం ఆసిఫాబాద్ ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, ఎంపీపీ మల్లిఖార్జున్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, వివిధ సంఘాల నాయకులు రూప్‌నార్ రమేశ్, ప్రణయ్, మారుతి పటేల్, కేశవ్‌రావ్, శంకర్, బాలేశ్వర్‌గౌడ్, మంగ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలకు నీడ కరువు



వంజారిగూడలోని నర్సరీ

లింగాపూర్: మండలంలోని వంజారిగూడలోని ఏక్‌నాథ్ అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన లింగాపూర్, మామిడిపల్లి గ్రామపంచాయతీలకు సంబంధించిన నర్సరీలోని మొక్కలు ఎండల తీవ్రతకు మాడిపోతున్నాయి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నీటిని అందిస్తున్నా నర్సరీకి షేడ్‌నెట్ ఏర్పాటు చేయకపోవడంతో మొక్కల ఎదుగుదల లేకుండా పోయింది. ఇప్పటికై నా అధికారులు స్పందించి నర్సరీకి శాశ్వతంగా నీడ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమయపాలన ఏది..?



ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



తలుపులు తెరుచుకోని ఎంపీడీవో చాంబర్ గది

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది, అధికారులు సమయపాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయానికి ఇద్దరు అటెండర్లు తప్ప సిబ్బంది, అధికారులు విధులకు హాజరుకాలేదు. కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి ఎంపీడీవో వరకు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలజీనగర్‌లో గల త్రినేత్ర శివాలయంలో శనివారం రాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాలలో శనివారం స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ భాను ప్రకాశ్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఎస్పీఎం చీఫ్ మేనేజర్ రమేశ్‌రావు, ఫౌండేషన్ మేనేజర్ రీనా బివాల్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, నాగేశ్వరరావు, శివకుమార్, నాయకులు అశోక్, శ్రీకాంత్, మహేశ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు భోజనం

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలంలోని కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువలో ట్రాక్టర్ బోల్తాపడి తీవ్ర గాయాలతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధిహామీ కూలీలకు కాంగ్రెస్ పట్టణ నాయకులు అండగా నిలిచారు. శనివారం ఉదయం అల్పాహారం అందించడంతో పాటు, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను వారు కోలుకునే వరకు అందిస్తామని, అధైర్యపడవద్దని, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో అండగా నిలుస్తున్నట్లు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహేందర్

నార్నూర్: తెలంగాణ మాదిగ దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కొర్రెల్లా మహేందర్ నియమితులయ్యారు. శనివారం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు కోరివెల్లి శ్రీనివాస్ నియమకపత్రాన్ని అందజేశారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న సభ్యులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఈ నెల 26న నిర్వహించనున్న కుమురం భీం నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందించారు. జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆహ్వాన పత్రం అందించినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేలాది సంతోష్, నైతం సాయినాథ్, పురుషోత్తం, సకారం, వాతు పటేల్ పాల్గొన్నారు.

రామాలయంలో కుంకుమ పూజలు



పెంచికల్‌పేట్: కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



బంగారు చీర అలంకరణలో అమ్మవారు

పెంచికల్‌పేట్: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి కలశపూజ, కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సముద్రాల సరిత, ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి

బెజ్జూర్: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ ప్రాంగణంలో శనివారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మహేశ్, సతీష్, శ్రీవర్ధన్, సంతోష్, కిరణ్, శంకరయ్య, నిలేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శనివారం కాగజ్‌నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 2 కిలోల బంగారు చీరతో అలంకరించారు. పండితులు బాచంపల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కుంకుమపూజ, చండీహోమం నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు గర్రెపల్లి గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గణపురం శ్రీనివాస్, కాసం శ్రీనివాస్, సభ్యులు గంగాధర్, మురళీధర్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్, సురేశ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

అయ్యప్ప ధర్మప్రచార కమిటీ

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ జిల్లా అధ్యక్షులుగా ఈదులపల్లి జ్యోతీష్, ఉపాధ్యక్షుడిగా ఉట్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్, కోశాధికారిగా కారం సాయికృష్ణలను ఎన్నుకున్నారు.